# పాలకుర్తి సోమేశ్వర స్వామికి వెండి కిరీటం సమర్పణ



**తెలుగు గళం న్యూస్ పాలకుర్తి ఆగస్టు 08**

పాలకుర్తి శ్రీ చండికా సమేత సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన షీలా నాగరాజు--మంజుల దంపతులు స్వామివారికి వెండి కిరీటాన్ని సమర్పించారు. సుమారు 177 గ్రాముల బరువున్న, రూ.45 వేల విలువైన మిశ్రమ వెండి కిరీటాన్ని శ్రీ సోమేశ్వర స్వామివారికి దంపతులు భక్తిపూర్వకంగా అందజేశారు. ఆలయ అర్చకులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది, భక్తులు దంపతులను అభినందించారు.

# విలేకరులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్‌ను పదవి నుండి తొలగించాలి:రేగొండ ప్రెస్ క్లబ్ డిమాండ్



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

విలేకరులపై దుర్భాషలాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని,ఆయనను పదవి నుంచి తొలగించి కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని రేగొండ మండల విలేకరుల సంఘం (ప్రెస్ క్లబ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం రేగొండ ప్రెస్ క్లబ్ ముఖ్య కార్యవర్గ సమావేశం నిర్వహించి ఏకగ్రీవ తీర్మానం చేశారు. రేగొండ మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు భూపాలపల్లి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ క్రమంలో రేపాక గ్రామంలో జరిగిన కార్యక్రమ వార్తా సేకరణ (కవరేజ్) కోసం వెళ్లిన విలేకరులను ఉద్దేశించి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య తీవ్ర స్థాయిలో దుర్భాషలాడుతూ,"ఏం రాసుకుంటారో రాసుకోండి" అంటూ తీవ్రంగా అవమానించారని పాత్రికేయులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తి, ప్రజాసేవలో ఉన్న విలేకరుల పట్ల ఇలా ప్రవర్తించడం పద్ధతి కాదని మండిపడ్డారు. ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి చైర్మన్ కిష్టయ్యపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. చైర్మన్‌పై తగిన చర్యలు తీసుకునేంత వరకు రేగొండ మండలంలో కాంగ్రెస్ పార్టీ తరపున నిర్వహించే ఎలాంటి కార్యక్రమాలను కవర్ చేయకూడదని,ఆ కార్యక్రమాలను బహిష్కరిస్తూ ప్రెస్ క్లబ్ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు సభ్యులు స్పష్టం చేశారు.

# చేయూత పెన్షన్ దరఖాస్తు కేంద్రాన్ని ప్రారంభించిన- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**తెలుగు గళం ధర్మసాగర్ న్యూస్**




ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో చేయూత పెన్షన్ దరఖాస్తుల సౌకర్యార్థంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి నేరుగా సర్పంచ్ రేణుక - వెంకట్ మరియు కార్యదర్శి సురేష్‌తో ఫోన్ ద్వారా సంప్రదించి దరఖాస్తుల ప్రగతి, అభ్యర్థుల వివరాలు, అవసరమైన సౌకర్యాలు గురించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రజాసేవ కోసం ఏర్పాటు చేసిన దరఖాస్తు కేంద్రాన్ని అధికారంగా ప్రారంభించారు.

కేంద్రంలో గ్రామ ప్రజల కోసం దరఖాస్తుల స్వీకరణ, వివరాల నమోదు మరియు సూచనలు అందించబడతాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ నాయకులు, వార్డు మెంబర్లు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# న్యాయస్థానం ఆదేశాల అమలులో జాప్యం

## ధర్మసాగర్ తహసీల్దార్ తీరుపై రైతు ఆవేదన



IN THE HIGH COURT FOR THE STATE OF TELANGANA AT HYDERABAD

THE HONOURABLE SRI JUSTICE N.V. SHRAVAN KUMAR

W.P. No.22613 of 2026

Date: 16.07.2026

Between:

Vallapureddy Krishna Reddy ... Petitioner


And

The State of Telangana,
Represented by its Principal Secretary,
Revenue Department,
Secretariat, Hyderabad and three others. ... Respondents

ORDER:

This writ petition is filed, under Article 226 of the Constitution of India, seeking the following relief:

"...to issue a Writ, order or direction more particularly one in the nature of Writ of Mandamus declaring the action of the Tahsildar/4th respondent in not considering the application of the petitioner dated 27.10.2023 for mutation of his name in the revenue records (Record of Rights) and consequently to issue pattadar passbook and title deed in respect of his agricultural land admeasuring Ac.4.12 gts., in Sy.No.237/A situated at Chatelparre Thanda, Narayanagiri Village, Dhamiasagar Mandal, Hanumakonda District, pursuant to the Judgment and Decree dated 12.09.2023 passed in O.S.No.869 of 2022 on the file of the Court of the III Additional Junior Civil Judge-cum-Judicial Magistrate of



**ధర్మసాగర్, (తెలుగు గళం)ఆగస్టు 8:**

నారాయణగిరి గ్రామ పరిధిలోని చటేల్ పర్రె తండాలో గల సర్వే నంబర్ 237/ఏలో ఎ.4.12 గుంటల భూమికి సంబంధించి ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు అమలు కావడం లేదని రైతు వల్లపురెడ్డి కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సదరు భూమికి సంబంధించి సివిల్ న్యాయస్థానం దావా సంఖ్య 869/2022, తేదీ 12-09-2023న ఇచ్చిన తీర్పు మేరకు తన పేరును రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని కృష్ణారెడ్డి 27-10-2023న ధర్మసాగర్ తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తెలంగాణ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి న్యాయమూర్తి ఎన్.వి. శ్రావణ్ కుమార్ 16-07-2026న ఉత్తర్వులు జారీ చేస్తూ, పిటిషనర్ 27-10-2023న సమర్పించిన వినతిని చట్ట ప్రకారం సహేతుకమైన సమయంలో పరిష్కరించాలని ధర్మసాగర్ తహసీల్దార్‌ను ఆదేశించినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు వెలువడి 24 రోజులు గడిచినా, ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేసి 20 రోజులు అవుతున్నా తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కనీసం తనకు నోటీసు కూడా ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయడంలో మరింత జాప్యం జరిగితే న్యాయస్థానం ధిక్కరణ చర్యలను ఆశ్రయిస్తామని, మరో ఏడు రోజుల్లో చర్యలు తీసుకోకపోతే ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని కృష్ణారెడ్డి తెలిపారు. ఈ విషయంపై హనుమకొండ జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయించి, తనకు న్యాయం చేయాలని రైతు వల్లపురెడ్డి కృష్ణారెడ్డి కోరారు.

# సికింద్రాబాద్‌లో కియా కొత్త ఎలక్ట్రిక్ కార్ ఆవిష్కరణ

**ప్రారంభించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్**




తెలుగు గళం :సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ శనివారం రాత్రి రైల్ నిలయం సమీపంలోని కియా మోటార్స్ షోరూమ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కియా మోటార్స్ సరికొత్త ఎలక్ట్రిక్ కారును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత రోజుల్లో కాలుష్య రహిత మరియు పర్యావరణ అనుకూల ఎలక్ట్రిక్ వాహనాల శకం ప్రారంభమైందని, భవిష్యత్తు అంతా ఈ వాహనాలదేనని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు ఇటువంటి ఇ-వాహనాలు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఘనమైన ఆవిష్కరణ కార్యక్రమంలో యువనేత తీగుళ్ళ కిశోర్ కుమార్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు, షోరూమ్ ప్రతినిధులు మరియు ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# రాజుపేటలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయాలి

**వర్షాలకు రోడ్లపైనే ప్రయాణికుల అవస్థలు -- వృద్ధులు, గర్భిణీలు, మహిళలు, చిన్నారులకు తీవ్ర ఇబ్బందులు**

**తాత్కాలిక బస్ షెల్టర్‌లో బైకుల పార్కింగ్ -- ప్రయాణికులకు అందని నీడ, కూర్చునే సౌకర్యం**

**తక్షణమే శాశ్వత ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాలి: ఆదివాసీ సంఘాలు, ప్రజాప్రతినిధులు**








**తెలుగు గళం -- మంగపేట, ములుగు:**

ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేట గ్రామంలో ఆర్టీసీ బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల కోసం రోడ్లపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొనడంతో వర్షాకాలంలో వృద్ధులు, గర్భిణీలు, మహిళలు, చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజుపేట గ్రామం నుంచి ప్రతిరోజూ వివిధ ప్రాంతాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించే శాశ్వత బస్టాండ్ లేకపోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిన సమయంలో బస్సుల కోసం రోడ్లపైనే నిలబడాల్సి రావడంతో తడిసిపోవడంతో పాటు ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని తెలిపారు. ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన షెల్టర్‌లో బైకుల పార్కింగ్ ప్రయాణికుల ఇబ్బందులను తగ్గించేందుకు ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్ షెల్టర్ కూడా పూర్తిస్థాయిలో ప్రయాణికులకు ఉపయోగపడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రయాణికులు కూర్చోవాల్సిన ప్రదేశంలో బైకులు పార్కింగ్ చేయడంతో వృద్ధులు, మహిళలు, గర్భిణీలు, చిన్నారులు కూర్చునేందుకు సరైన స్థలం లేకుండా పోతోందని చెబుతున్నారు. బస్సు కోసం గంటల తరబడి వేచి ఉండే ప్రయాణికులకు కనీసం కూర్చునే సౌకర్యం కూడా లేకపోవడం దారుణమని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక షెల్టర్‌ను ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా వినియోగించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, బైకుల పార్కింగ్‌ను నియంత్రించాలని కోరుతున్నారు.

శాశ్వత బస్టాండ్‌తోనే సమస్యకు పరిష్కారం

వర్షాకాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రాజుపేటలో తక్షణమే శాశ్వత ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు కూర్చునే సదుపాయం, వర్షం--ఎండ నుంచి రక్షణ, తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే గ్రామంలోని రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ తదితర మౌలిక వసతులను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. రాజుపేట గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించాలని గ్రామస్థులు కోరుతున్నారు. బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన స్థలం, నిధులు, ఇతర అనుమతులపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టి, రాజుపేట ప్రజలు ఎదుర్కొంటున్న చిరకాల ప్రజా రవాణా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు.

# గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రహరీ కూలిపోయి రోజులు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు!

**ప్రహరీ లేక పశువులు, కుక్కల సంచారం.. బాలికల హాస్టల్ భద్రతపై ఆందోళన**

**విద్యార్థినుల రక్షణకు వెంటనే ప్రహరీ నిర్మించాలి -- అధికారులు తక్షణమే స్పందించాలి**




**తెలుగు గళం ఏటూరునాగారం, ములుగు :**

ఏటూరునాగారం మండలం, ఆకులవారి ఘణపురం తాళ్లగడ్డలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో వర్షాలకు ప్రహరీ గోడ కూలిపోవడంతో విద్యార్థినుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ప్రహరీ కూలిపోవడంతో బాలికల హాస్టల్‌కు రక్షణ లేకుండా పోయిందని విద్యార్థులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీ గోడ కూలిన ప్రాంతం నుంచి పశువులు, కుక్కలు హాస్టల్ ఆవరణలోకి చొరబడుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. దీంతో బాలికలకు అసౌకర్యంతో పాటు భద్రతాపరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాలికల హాస్టల్ పరిసరాల్లో రక్షణ ఏర్పాట్లు అత్యంత కీలకమైనప్పటికీ, ప్రహరీ గోడ కూలిపోయిన విషయంపై సంబంధిత నిర్వాహకులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యార్థినుల భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లకముందే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, కూలిపోయిన ప్రహరీని పరిశీలించి, నాణ్యతతో కూడిన కొత్త ప్రహరీ నిర్మాణానికి తక్షణ చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వర్షాకాలంలో మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున అధికారులు ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించి వెంటనే ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టి బాలికల హాస్టల్‌కు పూర్తి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.





